క్లుప్తంగా

పారిశుద్ధ్య పనులు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని కేదారిపురం గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లే రహదారి పూర్తిగా అధ్వాన స్థితిలో ఉందని గురువారం సాక్షి దిన పత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శనివారం ప్రొక్లెయినర్‌తో రహదారిపై మట్టి కప్పి, పారిశుద్ధ్య పనులను పంచాయతీ కార్యదర్శి బదకల హరికృష్ణ చేయించారు. దీంతో ఉద్యోగులు, రైతులు, చిన్నారుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

పెద్ద శ్రీరాంపురంలో ఉపాధి పనులు



ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో తిరుమలరావు

కంచిలి: మండలంలోని పెద్దశ్రీరాంపురం గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పథకం పనులను స్థానిక ఎంపీడీవో వి.తిరుమలరావు శనివారం పరిశీలించారు. గ్రామంలో చేపడుతున్న సరిహద్దు కందకాల పనులను సమీక్షించారు. ఈ సందర్భంగా కూలీల వేతన ధరలు పెరుగుదలకు చేయాల్సిన పద్ధతులను సూచించారు. పరిశీలనలో ఏపీవో జి.ధనుంజయ, టెక్నికల్, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కవిటి విద్యార్థి



తరుణ్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం మల్లేశ్వరరావు తదితరులు

కవిటి: జిల్లా స్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ నిర్వహించిన బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తాచాటిన నాగుల తరుణ్ కుమార్ బెహరా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవ్వడం అభినందనీయమని హెచ్‌ఎం బెండాళం మల్లేశ్వరరావు అన్నారు. ఈ మేరకు పాఠశాలలో తరుణ్‌ను ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు శనివారం అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ మోహన్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు

పరామర్శ

కాశీబుగ్గ: మందస మండలం కుంటికోట గ్రామంలో ఇటీవల మరణించిన కొర్ల హేమారావు చౌదరి కుటుంబ సభ్యులను జిల్లా కాంగ్రెస్ పార్టీ పెద్దలు శనివారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంబటి కృష్ణ, నాయకులు తంగుడు వీరరాజు, డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు, తెంబూరు మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్పీలతో సమీక్ష సమావేశం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి మెప్మా కార్యాలయంలో శనివారం ఆర్పీలతో మెప్మా పీడీ ఎన్వీ రమణ సమీక్ష సమావేశం నిర్వహించారు. సంఘ సభ్యులు ప్రొడక్ట్స్ అమ్ముట గురించి ఎస్‌హెచ్‌జీ మెంబర్స్‌కి అవగాహన కల్పించమన్నారు. అనంతరం ఎన్‌బీయూ సర్వే 100 శాతం పూర్తి చేసి నిరుద్యోగ యువతని గుర్తించి వారికి శిక్షణ ఇప్పించడం, ఉపాధి కల్పించడం టార్గెట్‌గా పనిచేయాలని తెలియజేశారు. ఎస్‌హెచ్‌జీ ప్రొఫైల్ యాప్ గురించి సభ్యులకు తెలియజేసి 1వ తేదీ ప్రారంభించమన్నారు. కార్యక్రమంలో ఐబీ రామారావు, సీఎంఎం పిన్నింటి మోహనరెడ్డి, సీవో బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు సమాయత్తం

ఇచ్ఛాపురం రూరల్: పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నామని హెచ్‌ఎం నరేంద్రనాథ్ పట్నాయక్ అన్నారు. మండలంలోని కొళిగాం ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న స్టడీ అవర్స్‌ను శనివారం ఆయన పర్యవేక్షించారు. పదికి పది పాయింట్లు సాధించేందుకు విద్యార్థులను అన్ని సబ్జెక్టుల్లో సమాయత్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు పుస్తక పరిచయ సభ

సోంపేట: పట్టణంలోని కళాసీ సంఘ భవనం ముందు పర్యావరణ పరిరక్షణ సంఘం అధ్యక్షుడు డాక్టర్ యారాడి కృష్ణమూర్తి అధ్యక్షతన 'బీల కోసం-బతుకు కోసం' పుస్తక పరిచయ కార్యక్రమం ఆదివారం నిర్వహించనున్నట్లు పర్యావరణ పరిరక్షణ సంఘం, మత్స్యకార ఐక్యవేదిక నాయకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మానవహక్కుల వేదిక నాయకురాలు కె.అనురాధ పుస్తకాన్ని రచించారని పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని పర్యావరణ పరిరక్షణ సంఘం, మత్స్యకార ఐక్యవేదిక ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సాగునీరు అందించాలి

సోంపేట: పైడిగాం ప్రాజెక్టు ద్వారా దిగువ ప్రాంత రైతులకు సాగునీరు అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని బేసి రామచంద్రాపురం, జింకిభద్ర, పలాసపురం, బెంకిలి దిగువ గ్రామాలకు చెందిన రైతులు కోరుతున్నారు. ఎగువ ఉన్న రైతులు కాలువలో అడ్డుకట్టలు వేయడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాపోయారు.

చివరికి కష్టాలు..!



కూర్మనాథపురం వద్ద ఎండిపోయిన కాలువ



పొట్టదశలో ఉన్న వరిపైరు

- కీలక సమయంలో అందని వంశధార
- నీరు లేక ఎండిపోయిన కాలువలు
- ఆందోళనలో అన్నదాత

వజ్రపుకొత్తూరు: వేసవిని తలపించే ఎండలతో పాటు ముఖం చాటేసిన వరుణుడు అన్నదాతను ఆందోళనలోకి నెట్టేశాడు. వంశధారలో నీటిమట్టం తగ్గి కాలువల ద్వారా శివారు భూములకు సాగునీరు అందకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం వరి పొట్టదశ నుంచి ఇప్పుడిప్పుడే ధాన్యం కంకులు ఏర్పడుతున్నాయి. ఇటువంటి సమయంలో చివరి తడుపు చాలా ముఖ్యం. సాగునీరు అందకుంటే పొల్లు గింజలుగా మారి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. మరోపక్క మినుము, పెసర, వేరుశనగ, ఇతర పంటలకు సైతం చివరి తడుపు అవసరం. దీంతో సాగునీటి కోసం రైతన్న కాలువల వైపు దీనంగా చూస్తున్నాడు.

☛ 22,644 ఎకరాల్లో...

నందిగాం, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని పలాస సబ్ డివిజన్‌లో 22,644 ఎకరాల్లో వంశధార ఆయకట్టు ఉంది. పలాస మండలం జగన్నాథసాగరం, వజ్రపుకొత్తూరు మండలంలోని 60ఆర్‌ఎల్ 5ఎల్ బెండి ఛానెల్, 60ఆర్‌ఎల్ 5ఎల్ నారాయణపురం ఛానెల్, 5ఎల్ కొండవూరు, గర్తంవానిపేట, తుంభవానిపేట, దేశబట్టి నుంచి పెద్దబడాం, అంతరకుడ్డ, వజ్రపుకొత్తూరు, కిడిసింగి, తాడివాడలకు నీరు చేరడం లేదు. అలాగే 60ఆర్‌ఎల్ 9టీఈ, 60ఆర్ ఛానెల్ పరిధిలోని పాతటెక్కలి, పొల్లాడ, దేవునల్తాడ, కొమరల్తాడ మీదుగా సంతబొమ్మాళి మండలం మర్రిపాడు వరకు విస్తరించి ఉంది. ఈ కాలువలు ప్రస్తుతం నీరు లేక వెలవెలబోతున్నాయి. ఆయా ప్రాంతాల్లో దాదాపు 6,300 ఎకరాలు వరకు వరి సాగు చేస్తుండగా పొట్టదశలో ఉన్నాయి.

☛ 1,900 క్యూసెక్కులు అవసరం

పలాస సబ్ డివిజన్‌లోని శివారుకు సాగునీరు అందాలంటే వంశధార రిజర్వాయర్ నుంచి 1,900 క్యూసెక్కుల నీరు రావాలి. కానీ రాజర్వాయర్‌లో నీటి నిల్వలు లేక 1,500 క్యూసెక్కులు మాత్రమే దిగువకు వదులుతున్నారు. టెక్కలి మదనగోపాల సాగరం పూర్తిగా నిండాలంటే 360 క్యూసెక్కుల నీరు అవసరం. కానీ మదనగోపాల సాగరంలో నీటి నిల్వలు 260 క్యూసెక్కులకు పడిపోవడంతో పలాస సబ్‌డివిజన్‌లోని శివారు ప్రాంతాలకు నీరు అందడం లేదు.

నీటి నిల్వలు తగ్గడం వల్లే..

వంశధార బేసిన్‌లో నీటి నిల్వలు తగ్గడం వల్లే మదనగోపాల సాగరానికి నీరు చేరలేదు. రైతులు ఆందోళనలో ఉన్నారు. ఈ విషయాన్ని వంశధార ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్లాం. ప్రస్తుతం మదనగోపాల సాగరంలో 260 క్యూసెక్కుల నీరు ఉంది. మరో రెండు, మూడు రోజుల్లో 360 క్యూసెక్కులకు చేరుకుంటుంది. అప్పుడు జగన్నాథ సాగరం, కణితివూరు వద్దకు నీరు వచ్చి చేరుతుంది. అక్కడ నుంచి మర్రిపాడు, బెండి, దేబట్టి ఛానెల్‌ల ద్వారా కాలువల్లోకి నీరు వదిలి శివారు ప్రాంతాలకు నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటాం

– టి.రాజశేఖర్ రాజు, ఏఈఈ, వంశధార పలాస డివిజన్

చివరి తడుపు అవసరం



ప్రస్తుతం వరి పొట్ట దశలో ఉంది. నేను దాదాపు 15 ఎకరాల్లో వరి వేశాను. మా ప్రాంతానికి సాగునీరు చాలా అవసరం. ఇప్పటివరకు వంశధార నుంచి సాగునీరు చక్కగానే అందించినా, చివరిలో కాలువల నుంచి నీరు విడిచి పెట్టడంపై అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి సారించలేదు. దీంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. కావున వంశధార అధికారులు స్పందించి మా ప్రాంతానికి పూర్తిస్థాయిలో నీరు అందేలా చర్యలు తీసుకోవాలి.

– తమ్మినాన అప్పారావు, రైతు సీతాపురం

ఇసుక మేటలు ఏర్పడ్డాయి



మా ప్రాంతానికి ఎప్పుడూ సాగునీరు అందదు. 60ఆర్ ఎల్9టీఈ కాలువ పూర్తిగా ఇసుక మేటలు వేసింది. దానిని బాగు చేయాలని చాలా సార్లు మొరపెట్టుకున్నాం. కానీ స్పందించిన నాథుడే లేడు. మా ప్రాంతంలో 1200 ఎకరాల్లో సాగు భూమికి ప్రస్తుతం నీరు లేదు. పొట్టదశలో ఉంది. మొదటిలో సాగునీరు అందించి, పంట చేతికి అందే సమయంలో నీరు లేకుంటే అవి ఎండిపోతే పెట్టుబడులు కూడా రావు. దయచేసి రైతులకు సాగునీరు అందించాలి

– కె.భాస్కరరావు, రైతు, కొండవూరు

వేధిస్తున్న సిబ్బంది కొరత

నిత్యం కాలువలు, రిజర్వాయర్ల పరిస్థితిని పరిశీలించి అవసరమైన పనులు చేసేందుకు టెక్కలి డివిజన్‌లో వంశధార ప్రాజెక్టుకు 17 మంది ఏఈలు ఉండాలి. కానీ ముచ్చటగా ముగ్గురు ఏఈలే ఉండడంతో పని భారంతో రైతులకు సేవలందించడంలో విఫలం అవుతున్నారు. మరోపక్క సీజన్‌లో కాలువల వెంబడి 58 మంది వరకు లస్కర్‌లు నిత్యం తిరగాలి. కానీ 10 మందికి మంచి లేరు. ఇవన్నీ వంశధార ఆయకట్టు రైతులకు ఇబ్బందులుగా మారాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నేతలు మాత్రం ప్రతీ చేనుకూ నీరంటూ ప్రచార ఆర్భాటం చేశారే తప్ప.. రైతులను ఆదుకోవడంలో చిత్తశుద్ధి ప్రదర్శించడం లేదని అన్నదాతలు వాపోతున్నారు.

• పరిశీలన

డివిజన్ కేంద్రమైన టెక్కలిలో ఉన్న జిల్లా కేంద్ర ఆస్పత్రి పాత భవనాలను టెక్కలి ఆర్డీవో ఎస్.కృష్ణమూర్తి అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. టెక్కలిలో ఆస్పత్రికి నూతన భవనాలు నిర్మాణం చేపట్టిన తర్వాత పాత భవనాలు ఖాళీ అయ్యాయి. ఈ ఖాళీ భవనాలను ప్రభుత్వం వినియోగంలోకి తెసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అద్దె భవనాల్లో ఉన్న పలు ప్రభుత్వ కార్యాలయాలను ఈ భవనాల్లోని తీసుకు రావాలనే ఉద్దేశంతో పరిశీలించారు. ఆయనతో పాటు



హౌసింగ్, మండల పరిషత్ అధికారులు ఉన్నారు.

– టెక్కలి

• కూల్చివేత

సంతబొమ్మాళి మండలంలోని పాలతలగాం పంచాయతీ ఉద్దండపాలేంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు చింతాడ రామారావు, రాంబాబుల ఇంటి ప్రహరీ గోడను కక్ష సాధింపు చర్యల్లో భాగంగా శనివారం కూల్చివేశారు. పూర్వం నుంచి ఇంటికి ప్రహరీ గోడ ఉన్నప్పటికీ, స్థానిక టీడీపీ నాయకుల ఫిర్యాదుతో తహసీల్దార్ రమేష్‌కుమార్ కూల్చి వేయించారు. అధికార పార్టీ నాయకులు కక్ష సాధింపు చర్యలకు పూనుకున్నారని రెవెన్యూ అధికారులకు చెప్పినా పట్టించుకోకుండా, అధికార పార్టీ ఒత్తిడితో కూల్చివేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

– సంతబొమ్మాళి



• అవగాహన

ఎయిడ్స్ రహిత సమాజమే లక్ష్యంగా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ రిసోర్స్ ప్రతినిధి హనుమంతు నాగభూషణరావు అన్నారు. మండలంలోని డోకులపాడులో శనివారం సర్పంచ్ వడ్డి సరిత ఆధ్వర్యంలో ఏపీ శాక్స్ సహకారంతో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం ప్రతినిధులు ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు, ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా 84 మందికి హెచ్‌ఐవీ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో



ఎంపీటీసీ కొయిరి భాగ్యలక్ష్మీ, వైఎస్సార్‌సీపీ నాయకులు వడ్డి కరుణాకర్, కె.ఢిల్లీరావు తదితరులు పాల్గొన్నారు.

– వజ్రపుకొత్తూరు రూరల్

• ప్రోత్సాహం

కంచిలి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు 2023-24 విద్యా సంవత్సరంలో జవహర్ నవోదయకు ఎంపికయ్యారు. దీంతో వారికి ఒక్కొక్కరికీ రూ.5 వేలు చొప్పున విశ్రాంత హెచ్‌ఎం ఎస్.సోమేశ్వరరావు శనివారం ఏర్పాటు చేసిన తల్లిదండ్రుల సమావేశంలో ఎంఈవోలు ఎస్.శివరాంప్రసాద్, కె.చిట్టిబాబు చేతులమీదుగా శనివారం అందజేశారు. ప్రోత్సాహకాలు అందుకున్నవారిలో నర్తు రామ్‌రన్వీర్, కంబాల మహిత్‌రెడ్డి, ఇంటివెనుక



కౌశిక్‌లు ఉన్నారు. అలాగే విద్యార్థులకు నవోదయ ప్రవేశ పరీక్షకు ఉచితంగా శిక్షణ ఇచ్చిన పాఠశాల ఉపాధ్యాయుడు నల్లాన రవిని సత్కరించారు.

– కంచిలి

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



బహాడపల్లిలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

కాశీబుగ్గ: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని గ్రీన్ ఆర్మీ సభ్యులు అన్నారు. మందస మండలం బహాడపల్లి ఉన్నత పాఠశాలలో గ్రీన్ ఆర్మీ ఆధ్వర్యంలో కదంబ, బాదం, చెర్రీ, ఉసిరి, కాము, తురాయి తదితర వివిధ రకాల నీడనిచ్చే మొక్కలను శనివారం నాటారు. ఈ సందర్భంగా గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్ మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యం కాపాడాలంటే మొక్కలను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధానోపాధ్యాయుడు కృష్ణమూర్తి మాట్లాడుతూ పర్యావరణపై విద్యార్థులకు ఇప్పటినుంచే అవగాహన కలిస్తే, రాబోయే రోజుల్లో మంచి ఫలితాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతీ విద్యార్థి పుట్టినరోజు నాడు స్కూల్‌లో కొన్ని మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, దీనబంధు, వసంతరావు, ప్రకాష్‌రావు, శంకరరావు, విజయలక్ష్మి, రెహనా, దీప్తి, సాంబమూర్తి కృష్ణారావు, వెంకటరమణ, డిల్లీరావు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల పరిశీలన



కేజీబీవీలో కూరగాయలు పరిశీలిస్తున్న జడ్జి శ్రీనివాసరావు

నందిగాం: మండలంలోని మదనాపురం కేజీబీవీ, సవరలింగుపురంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను టెక్కలి ఫుల్ అడిషనల్ చార్జి సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు శుక్రవారం రాత్రి సందర్శించారు. ఏపీ న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆదేశాల మేరకు వసతి గృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహాల స్థితిగతులు, పిల్లలకు సమకూర్చుతున్న వసతులు, ఆహారం, పడుకునే గదులు, భోజనం మెనూ, వైద్య విధానం, పాల నాణ్యత తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

భూ సమస్యల పరిష్కారానికి గ్రామసభలు



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు నారాయణమ్మ

ఇచ్ఛాపురం రూరల్: రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కారానికి గ్రామ సభలు చక్కని వేదికలని జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ అన్నారు. మండలంలోని ఈదుపురం గ్రామంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో రైతులకు అందజేసిన డిజిటల్ పుస్తకాల్లో ఏమైనా తప్పొప్పులు ఉంటే సరి చేసుకోవచ్చన్నారు. మరణించిన వారి స్థానంలో పేరు మార్పునకు పూర్తి వివరాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దువ్వు వివేకానందరెడ్డి, నర్తు ప్రేమ్‌కుమార్ యాదవ్, పంచాయతీ కార్యదర్శి ఎస్.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు అందుబాటులో ఉంచాలి



తనిఖీలు నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

సోంపేట: వ్యవసాయ శాఖ సూచించిన ఎరువులు, పురుగు మందులను దుకాణాల్లో అందుబాటులో ఉంచాలని దుకాణదారులకు వ్యవసాయాధికారులు సూచించారు. మండలంలోని సోంపేట, కొర్లాం గ్రామాల్లో పురుగు మందుల విక్రయ దుకాణాల్లో పలాస వ్యవసాయ సహాయ సంచాలకుడు వి.మధు ఆధ్వర్యంలో శనివారం తనిఖీలు నిర్వహించారు. రైతులకు కొనుగోలు రశీదులు తప్పకుండా ఇవ్వాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే విక్రయించాలని స్పష్టం చేశారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. తనిఖీల్లో వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

ఇచ్ఛాపురం: పట్టణ పోలీస్‌స్టేషన్‌లో అప్పన్నపేటకు చెందిన వివాహిత అదృశ్యమైనట్లు కేసు నమోదైందని ఎస్‌ఐ ఇ.చిన్నంనాయుడు తెలిపారు. ఈనెల 19వ తేదీన తన భార్య సుర్లా గ్రామానికి వెళ్తానని చెప్పి ఫోన్ చేసిందని, తర్వాత నుంచి ఫోన్ స్విచ్ ఆఫ్ అయ్యిందని భర్త ఫిర్యాదులో పేర్కొన్నారు. భర్త కలకత్తా నుంచి వచ్చి సమీప గ్రామాల్లోని బంధువుల ఇళ్ల వద్ద గాలించినప్పటికీ ఆచూకీ దొరకలేదన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేవీ లెఫ్టినెంట్‌గా చినబాడాం విద్యార్థి



రఘురామ్

పలాస: పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని చిన బాడాం గ్రామానికి చెందిన విద్యార్థి బొడ్డ రఘురామ్ నేవీలో లెఫ్టినెంట్ ఆఫీసర్ పోస్టుకు ఎంపికయ్యాడు. ఇటీవల జరిగిన ఎన్‌డీఏ పరీక్షలో అతనికి జాతీయ స్థాయిలో 71వ ర్యాంకు వచ్చింది. ఈ మేరకు అతనికి తగిన ఉత్తర్వులు అందాయి. అతని తండ్రి బి.రమేష్‌బాబు మాజీ సైనిక ఉద్యోగి. అతను ఉద్యోగ విధులు నిర్వహిస్తున్న సమయంలో పంజాబ్ రాష్ట్రంలో పటాన్ కోట్‌లోని కేంద్రీయ విద్యాలయంలో రఘురామ్ ప్రాథమిక విద్యాభ్యాసం చేశాడు. అనంతరం కోరుకొండ సైనిక స్కూల్‌లో ఇంటర్మీడియట్ వరకు చదివాడు. తర్వాత ఎన్‌డీఏ పరీక్ష రాసి నేవీలో లెఫ్టినెంట్ అధికారిగా ఉద్యోగం సంపాదించాడు. దీంతో గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

'తక్షణ చర్యలు తీసుకోవాలి'

కవిటి: గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులపై స్థానిక సంస్థల సిబ్బంది తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంపీడీవో కె.శ్రీనివాసరెడ్డి సూచించారు. మండలంలోని కొజ్జిరియాలో జరుగుతున్న పారిశుద్ధ్య స్పెషల్ డ్రైవ్‌ను శనివారం ఆయన పరిశీలించారు. గ్రామంలో బ్లీచింగ్ చల్లడం, మురికి తొలగింపు చేపట్టిన ప్రాంతాల్లో స్ప్రేయింగ్ చేయించారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు నితిన్



నితిన్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఇచ్ఛాపురం రూరల్: ఈనెల 28, 29 తేదీల్లో బాపట్ల జిల్లా ఈదిపల్లిలో జరగనున్న రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు తమ పాఠశాలకు చెందిన పి.నితిన్ ఎంపికయ్యాడని డొంకూరు ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ వెంకటరమణ తెలిపారు. ఈ మేరకు విద్యార్థిని పాఠశాలలో శనివారం అభినందించారు.

రూ.1.32 లక్షలకు గజలక్ష్మి చీర వేలంపాట

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధి రత్తకన్న గ్రామంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న గజలక్ష్మి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి అలంకరించిన చీరకు వేలంపాట నిర్వహించగా రూ.1.32 లక్షలు పలికింది. శనివారం రత్తకన్న నాయుడువీధిలో గజలక్ష్మి నవరాతి ఉత్సవ మండపం వద్ద చీర వేలంపాట నిర్వహించారు. ఈ వేలం పాటలో అదే ప్రాంతానికి చెందిన అనిల్‌కుమార్ దొళాయి, జ్యోతి దంపతుల కుమారుడు అకీరానందన్ దొళాయి రూ.1,32002లకు చీరను దక్కించుకొన్నాడు.

డైవర్షన్ పాలిటిక్స్‌పైనే చంద్రబాబు దృష్టి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

కవిటి: రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్‌ను చంద్రబాబు అండ్ కంపెనీ చేపడుతోందని ఎమ్మెల్సీ నర్తు రామారావు దుయ్యబట్టారు. కొత్తపుట్టుగలోని తన నివాసంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయన్నారు. ఇటీవల కాలంలో రోజుకొక ప్రాంతంలో అఘాయిత్యాలు జరుగుతున్న వైనం జాతీయ, స్థానిక మీడియాలో వెలువడుతున్న కథనాలే ఇందుకు నిదర్శనమన్నారు. డయేరియాతో ఒక విజయనగరంలోనే 13 మంది చనిపోవడం దారుణమన్నారు. సూపర్ సిక్స్ పేరిట మోసపూరిత హామీలు ఇచ్చి..అమలులో గాలికి వదిలేశారని ధ్వజమెత్తారు. ఏడాదికి మూడు వేల కోట్లతో గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసేందుకు ఆరు నెలల సమయం తీసుకుంటున్నారని, ఈ లెక్కన సూపర్ సిక్స్‌లో ఒక సిక్స్ కూడా కొట్టలేరని, వీటి నుంచి ప్రజల దృష్టి మరలించేందుకు రోజుకో అంశాన్ని తెరమీదకు తీసుకొస్తున్నారని మండిపడ్డారు.

'కూర్మాశ్రమ భూకేటాయింపు రద్దు చేయాలి'



మాట్లాడుతున్న నారాయణరావు తదితరులు

నందిగాం: ఆదివాసీ మహిళపై దాడి చేసిన కూర్మాశ్రమ అగ్రకుల దౌర్జన్యకారులను కఠినంగా శిక్షించాలని, తెలంగాణకు చెందిన అగ్రకులాల వారు నడుపుతున్న ఈ ఆశ్రమానికి కేటాయించిన 18 ఎకరాల భూమిని రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ శ్రీకాకుళం శాఖ అధ్యక్ష, కార్యదర్శులు బోకర నారాయణరావు, అక్కురాడ లోకనాథంలు డిమాండ్ చేశారు. ఈ మేరకు నందిగాంలో శనివారం వారు మాట్లాడారు. ఈనెల 19వ తేదీన జలుమూరు మండలం సవర మాకివలసకు చెందిన ఆదివాసీ మహిళపై ఆశ్రమానికి చెందిన అగ్రకులాల వారు దౌర్జన్యం చేయడమే కాకుండా, మహిళను వివస్త్రను చేసి దాడి చేయడం హేయమైన చర్యగా మండిపడ్డారు. దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్ర ప్రాంతంలో వందల ఏళ్ల నుంచి ఆదివాసీల అనుభవంలో ఉన్న భూములను ఆశ్రమానికి కేటాయించడం అన్యాయమన్నారు. ఇటీవల శారదా పీఠానికి చెందిన భూకేటాయింపులు రద్దు చేసిన ప్రభుత్వం, తెలంగాణాకు చెందిన అగ్రకులాల వారికి కేటాయించిన 18 ఎకరాలను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీలను దాడుల నుంచి కాపాడి వలసదారులను ఇక్కడ నుంచి తరిమివేయాలని కోరారు. వారితో పాటు చింతాడ శ్రీనివాస్, టెక్కలి గణపతిరావు ఉన్నారు.

బస్ సర్వీసులను వినియోగించుకోవాలి

- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



బస్ సర్వీసులను ప్రారంభిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి: జిల్లా ప్రజలంతా ఆర్టీసీ బస్ సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. టెక్కలిలో నూతన బస్ సర్వీసులను శనివారం ప్రారంభించారు. దీనిలో భాగంగా స్థానిక పోలీస్‌స్టేషన్ దగ్గర ఏర్పాటు చేసిన ఆర్టీసీ కొత్త బస్సులకు పూజలు చేసి, అనంతరం జెండా ఊపి ఏడు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా ప్రజలు సుదూర ప్రాంతాలకు వెళ్లేందుకు వీలుగా ఈ బస్ సర్వీసులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఆర్‌ఎం, శ్రీకాకుళం-1, 2 డిపోల మేనేజర్లు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ, కింజరాపు హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బొడ్డపాడు విద్యార్థి ప్రతిభ



రాపాక ప్రణీత్

పలాస: మండలంలోని బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి రాపాక ప్రణీత్ కబడ్డీలో ప్రతిభ చూపించాడు. అండర్-17 విభాగంలో జిల్లా కబడ్డీ జట్టుకు ఎంపికయ్యాడు. అన్నమయ్య జిల్లాలో ఈనెల 27 నుంచి 29 వరకు జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నాడు. దీంతో విద్యార్థిని పాఠశాలలో శనివారం అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎ.వీర్రాజు, పీడీ రామ్‌జీ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరులకు నివాళులు

ఇచ్ఛాపురం: స్థానిక సీబీఎస్‌సీ పాఠశాల జ్ఞాన భారతి విద్యార్థులు పోలీస్ అమరవీరులకు ఘనంగా నివాలర్పించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పాఠశాల సీఈవో జోహార్‌ఖాన్ ఆధ్వర్యంలో విద్యార్థులు పోలీస్ అని ఇంగ్లీష్ అక్షర క్రమంలో కూర్చొని పోలీసులపై గౌరవాన్ని శనివారం చాటుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ట్రస్టీ రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐబీపండా, హెచ్‌ఎం రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్ పాల్గొన్నారు.